క్లుప్తంగా

అధ్యాపకులకు డాక్టరేట్




మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఇద్దరికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌లను ప్రదానం చేసింది. ఈమేరకు తెలుగు విభాగం అధ్యాపకులు నాగులవరం లక్ష్మీనర్సింహారావు, గణిత విభాగం అధ్యాపకులు రాజేశ్వరీ డాక్టరేట్ సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అధ్యాపక బృందంతో కలిసి వారిని అభినందించారు.

ఎల్కిచర్ల వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల వద్ద శుక్రవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నాగర్ కర్నూల్ జిల్లా వచ్చే నుంచి వాహనాలను తనిఖీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇద్దరు అధికారులు, పోలీసులతో కూడిన ఎస్ఎస్‌టీ టీంను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కు చెందిన జర్నలిస్టు ఏ. రాములు మరణ వార్త తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్, నరేందర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, కమిషనర్ సురేందర్‌రెడ్డి తదితరులు రాములు మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

మొన్న కాంగ్రెస్‌లోకి.. నిన్న బీఆర్ఎస్‌లోకి..



హన్వాడ: పార్లమెంట్ ఎన్నికల వేళ రాజకీయ పార్టీలో చేరికలు సాగుతున్నాయి. బుధవారం బీఆర్ఎస్‌కు చెందిన ఎఫ్ఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాసులు కాంగ్రెస్‌లో చేరారు. సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న శ్రీనివాసులు తాజాగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. గురువారం మండల కేంద్రానికి వచ్చిన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి నేరుగా శ్రీనివాసులు ఇంటికి వెళ్లి మంతనాలు జరిపారు. దీంతో అతడు మళ్లీ బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. మాజీ ఎంపీటీసీ నాగన్న సైతం కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు సొంత పార్టీ నేతలే అనుకుంటున్న తరుణంలో ఎంపీ మండలానికి వచ్చారు. దీంతో అటు శ్రీనివాసులు, ఇటు నాగన్న పార్టీతోనే ఉంటున్నట్లు తేలింది.

మండుటెండలో కాలినడక

- గ్రామాలకు బస్సుసౌకర్యం కరువు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రజలు



ఎండలో బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



వెన్నాచేడ్ నుండి ఎండలో కాలినడకన జానంపల్లికి నడుస్తున్న విద్యార్థులు

గండేడ్: మండల పరిధిలోని పలు గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండలో సైతం కాలినడక సాగిస్తున్నారు. భానుడి ప్రతాపానికి ముఖ్యంగా విద్యార్థులు విలవిలాడుతున్నారు. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో వారి అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. మండలంలో 63 పాఠశాలలు ఉండగా 7,850 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌తో పాటు వెన్నాచేడ్‌లో 2, గండేడ్‌లో 2, కొంరెడ్డిపల్లి, బల్సూర్‌గొండ, చిన్నవార్వాల్ గ్రామాల్లో బాలుర, బాలికల పాఠశాలలు ఉండగా మిగతావి ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. కాగా చాలా వరకు పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యాలు లేవు. దీంతో కాలినడకనే నమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు మండుటెండ వారి పాలిటశాపంగా మారింది. గతంలో ఎన్నడు లేనంతగా భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో విద్యార్థులు అంత ఎండలో అలాగే పుస్తకాలను మోస్తూ భారంగా కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు కూడా లేక తప్పనిసరి పరిస్థితుల్లో ఎండకు తాళలేక లారీల్లో సైతం ఎక్కి వెళ్తుండడం గమనార్హం.

ఆయా గ్రామాలకు పరిస్థితి ఇలా..

మండలంలోని పగిడ్యాల్ సల్కర్‌పేట్ రూటులో ఒక్క బస్సు కూడా లేదు. దీంతో ఈ మార్గంలో పగిడ్యాల్, బల్సూర్‌గొండ, తువ్వగడ్డ తండా, బల్సూర్‌గొండ తండా, మన్సూర్‌పల్లి , మన్సూర్‌పల్లి తండాల నుంచి వెళ్లే విద్యార్థులకు ఏళ్లుగా సమస్య తప్పడం లేదు.

అదేవిధంగా జక్లపల్లి, జిన్నారం, పెద్దవార్వాల్, చిన్నవార్వాల్, రుసుంపల్లి, ఆశిరెడ్డిపల్లి, గోవిందుపల్లి , గోవిందుపల్లి తండాలకు సైతం బస్సు సౌకర్యం కొరవడింది.



సమయానికి బస్సు రాక లారీ ఎక్కుతున్న విద్యార్థులు

కొత్లాబాద్ బస్సు రాకపోకలు ఆగిపోయి దాదాపు మూడేళ్లు కావస్తున్న పునరుద్ధరణ జరగలేదు.

కొన్ని రూట్లలో ఒకటి, రెండు బస్సులు అడపాదడపా వస్తున్నప్పటికీ కిక్కిరిస్తున్నాయి.

బస్సులు సమయానికి రాకపోవడం కూడా సమస్యగా మారింది.

ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి విద్యార్థులకు, ప్రయాణికులకు సమస్య లేకుండా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నడక తప్పడం లేదు

మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. రోజు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. రోజూ దాదాపు 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. మధ్యాహ్నం పాఠశాల వదిలాక ఇబ్బందులు తప్పడం లేదు. వెన్నాచేడ్‌కు బస్సు సమయానికి రాకపోతుండడంతో కాలినడక తప్పడం లేదు. ఎండ ఎక్కువగా ఉంటోంది. సమయానికి బస్సు వస్తే కనీసం 4 కిలోమీటర్లు నడక తగ్గుతుంది. ఇక మిగతా ఆరు కిలోమీటర్లయితే ఎప్పుడైనా నడవాల్సిందే.

– రఘువర్ధన్,
9వతరగతి, ఆశిరెడ్డిపల్లి

నడవ లేకపోతున్నా

నేను వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో చదువుతున్నా. ఉదయం పూట బస్సు దొరకడంతో వెన్నాచేడ్‌లో దిగుతున్నాం. కానీ మధ్యాహ్నం మాత్రం బస్సు సమయానికి రాదు. ఒక్కోసారి అసలే రాకపోవడంతో జానంపల్లి వరకు నడవాల్సి వస్తోంది. ఎండలో నడవాలంటే నీరసం వస్తోంది. ఎండకు కళ్లు తిరుగుతాయి. అయినా నడవక తప్పదు. సల్కర్‌పేట్ నుంచి పగిడ్యాల్‌కు బస్సు లేవు. గంటల తరబడి నిరీక్షించినా ఆటోలు కూడా దొ రకవు. ఎండలో నడవాలంటే భయం వేస్తుంది.

– శ్రీకాంత్,
7వ తరగతి, పగిడ్యాల్

చర్యలు తీసుకుంటున్నాం

ఎండకాలం నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వెన్నాచేడ్ మోడల్ స్కూల్ కోసం మహబూబ్‌నగర్ నుంచి ఉదయం 6.50 గంటలకు బస్సు బయలుదేరుతుంది. మధ్యాహ్నం మద్దూరు ట్రిప్ చూసుకొని తిరిగి వెన్నాచేడ్‌కు పంపిస్తున్నాం. ఎప్పుడన్నా ఒకటి, రెండు సార్లు మిస్సై ఉండవచ్చు. కోస్గి నుంచి మహబూబ్‌నగర్ వరకు విద్యార్థులు ఎక్కడ ఉన్నా అందరిని ఎక్కించుకొనేలా చూస్తాం. ఈ రూట్లో దాదాపు 40 బస్సులు నడిపిస్తున్నాం. పగిడ్యాల్ రూట్లో బస్సు నడపడం పరిధి కాదు. ఎవరైనా వినతులు ఇస్తే ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– సుజాత, డిపో మేనేజర్, మహబూబ్‌నగర్

సివిల్స్ ర్యాంకర్లకు ఘనసన్మానం



అనన్యారెడ్డిని సన్మానించిన బ్యాంక్ అధికారులు



ఎహ్తెదా ముఫస్సిర్‌తో నాయకులు

అడ్డాకుల: పొన్నకల్‌కి చెందిన దోనూరు అనన్యరెడ్డి సివిల్స్‌లో ఆలిండియా మూడో ర్యాంకు సాధించిన నేపథ్యంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్‌రెడ్డి శుక్రవారం ఆమెను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఏపీ.మిథున్‌రెడ్డి కూడా అనన్యతో పాటు ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను అభినందించారు. ఎంపీపీ నాగార్జున్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, నారాయణగౌడ్, మధుసూదన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రామన్‌గౌడ్, బగ్గి కృష్ణయ్య ఉన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: అనన్యరెడ్డిని శుక్రవారం వారి నివాసంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఆర్.సత్యనారాయణ సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మెట్టుగడ్డ బ్యాంక్ మేనేజర్ అమిత్‌కుమార్ సాహూ, సీనియర్ మేనేజర్ క్రితి జస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: సివిల్స్‌లో సత్తాచాటిన ఎహ్తెదా ముఫస్సిర్ ను శుక్రవారం బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకులు మహ్మద్ సాధిక్ శుక్రవారం జిల్లాకేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మత పెద్దలు చాంద్ పాష, ఆజం, సలీం, యూసుఫ్, నజీమ్, మహమూద్ తలితదరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఘనంగా పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించి దేవి లలితా పారాయణం చేశారు. అనంతరం వాసవీమాత పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

కనులపండువగా ప్రభోత్సవం



ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి సప్తాహ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారి ప్రభోత్సవం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున 5 గంటలకు ఆలయం నుంచి ప్రారంభం అయిన ప్రభోత్సవం ఉదయం 7 గంటల వరకు కొనసాగింది. పట్టణంలోని ప్రధాన వీధిలో కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు హరహర మహాదేవ అంటూ వేడుకలో పాల్గొన్నారు. అదేవిధంగా వారం రోజులుగా ఆలయంలో అఖండ భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నేడు రథోత్సవం..

సప్తాహ మహోత్సవాలలో భాగంగా చివరి రోజు స్వామి వారి రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లను చేశారు. శనివారం తెల్లవారు జామున 5 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. దేవస్థానం వారు బాణాసంచా కాల్చడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండలంలోని ప్రతి గ్రామంలో అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని అడిషనల్ డీఆర్‌డీఓ మేహనత్‌బేగం సూచించారు. శుక్రవారం మండలంలోని జమాల్‌పూర్, రాంపూర్ గ్రామాలలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట టెంట్లు, తాగునీటి వసతి, ఓఆర్ఎస్ పాకెట్లను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా మండల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాళప్ప, ఏపీఓ నర్సయ్య, పంచాయతీకార్యదర్శి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



మిద్దెల జితేందర్‌తో నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సేవాదళ్‌లో పలువురి నియామకం చేపట్టారు. జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా లోక్‌నాథ్, జిల్లా కార్యదర్శిగా సంజీవ్ కుమార్, పట్టణ సేవాదళ్ అధ్యక్షుడిగా ఎండి.అలీ అమీరుద్దీన్‌లను నియామకం చేయగా రాష్ట్ర అధ్యక్షులు జితేందర్, జిల్లా అధ్యక్షులు రాజేందర్‌రెడ్డిలు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జితేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి సుదీర్ఘమైన చరిత్ర ఉందన్నారు. సేవాదళ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ఎంతో కీలకమైనవని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. సేవాదళ్ విభాగాన్ని జిల్లా, పట్టణంలో మరింతగా పటిష్టం చేయాలని సూచించారు. పదవులు పొందిన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన రాష్ట్ర నాయకులతోపాటు సీనియర్ సేవాదళ్ నాయకులు అన్వర్‌పాష, సుభాష్‌ఖత్రీ, సంజీవ్‌రెడ్డి, వాజిద్‌పాష, లక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. సేవాదళ్ విభాగాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

ఎక్కడి సమస్యలు అక్కడే!



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

- మున్సిపాలిటీలో కరువైన పర్యవేక్షణ
- ఎన్నికల కోడ్ కారణంగా రద్దయిన కౌన్సిల్ సమావేశాలు
- కౌన్సిలర్లే వినతిపత్రాలు సమర్పించే పరిస్థితి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. పర్యవేక్షణ కరువవటం, ఎన్నికల కోడ్ కారణంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవటంతో రోజురోజుకు సమస్యలు పెరుగుతున్నాయి. చివరకు కౌన్సిలర్లే సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించే పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన దోరేపల్లి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా పాలాది సారిక కొనసాగుతున్నారు. గతేడాది డిసెంబర్ నెల రెండో వారం వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండింది. రెండు నెలల వ్యవధిలో మరోమారు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఫిబ్రవరి మూడో వారం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అంతకుముందే మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న మహమూద్‌షేక్ సైతం బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో ఎస్.రాజయ్య ఫిబ్రవరి 13న బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో పాలనకొంత కుంటుపడిందనే చెప్పాలి. ఎమ్మెల్సీ కోడ్ ఉండగానే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో మార్చి మొదటి వారంలో నిర్వహించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ఈ కారణంగా ప్రజా సమస్యలను చర్చించే అవకాశం సభ్యులకు లేకుండా పోయింది. దీంతోపాటు ప్రస్తుత చైర్‌పర్సన్ అదే పార్టీలోని కౌన్సిలర్ల నుంచి వ్యతిరేకత మూటకట్టుకున్నారు. పాలకవర్గ గడువు మే 5తో మూడేళ్లు ముగియనుంది. మూడేళ్ల గడువు సమీపిస్తుండటంతో అవిశ్వాసం పెట్టటానికి పలు దఫాలుగా కొందరు కౌన్సిలర్లు సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. ఈ కారణంగా ప్రస్తుత చైర్‌పర్సన్ పాలనపై అంతగా దృష్టి సారించటం లేదు. దీంతో మున్సిపాలిటీలో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి.

ప్రధాన సమస్యలివే..

మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య మొదైలంది. పది రోజుల కిందటి వరకు రోజు విడిచి రోజు నీళ్ల సరఫరా చేసేవారు. మిషన్‌భగీరథ నుంచి రోజు కోటి లీటర్ల నీటి సరఫరా వస్తున్నప్పటికీ ప్రస్తుతం కొన్ని కాలనీల్లో నాలుగు రోజులకు ఓసారి మాత్రమే నీళ్ల వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీళ్ల వదిలినపుడు లీకేజీలు వెంటాడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహణ లోపం కారణంగా నీళ్ల వృథాగా పోతున్నాయి. నీటి సమస్యపై ప్రత్యేక అధికారి జెడ్పీ సీఈఓ స్థానిక కమిషనర్, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో 17 చెత్త సేకరణ బండ్లు ఉన్నాయి. వాటిలో 9 బండ్లు పాడయ్యాయి. కాలనీల్లో రోజు వచ్చే చెత్త బండ్లు రాకపోయేసరికి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం రెండు, మూడు రోజులకోమారు కాలనీల్లో చెత్తబండ్లు వస్తున్నాయి. పాడైన బండ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోకుండా ఉన్నారు. దోమలకు ఫాగింగ్ చేయకపోవటం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు పెరుగుతున్నాయి. వీటితో మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేష్, నందకిశోర్‌గౌడ్, శశికిరణ్ మూడురోజుల క్రితం కమిషనర్ రాజయ్యకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రానికి స్పందించిన కమిషనర్ కాలనీ పర్యటనలతో పాటు సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

నర్సరీల్లో ప్రతి మొక్కను బతికించుకోవాలి



దేశాయిపల్లిలో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

మహమ్మదాబాద్: వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని.. నర్సరీల్లో ప్రతి మొక్కను బతికించుకోవాలని గండేడ్ ఎంపీడీఓ దేవన్న సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని దేశాయిపల్లి, జూలపల్లి గ్రామాల్లో నర్సరీలను, ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలతో బాటు నాటిన వాటిని సైతం జాగ్రత్తగా కాపాడాల్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్న దృష్ట్యా కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. కొన్ని గ్రామాల్లో కూలీలు తక్కువగా వస్తున్నారని.. అవగాహన కల్పించాలని క్షేత్రసహాయకులకు సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ హరిచ్చంద్రుడు ఆయా గ్రామాల క్షేత్రసహాయకులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టిసారించాలి



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న జిల్లా అధికారి శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. గతంలో నిర్వహించిన పలు ఆటల పోటీలకు సంబంధించి బహుతులను జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై దృష్టి సారిస్తే, సులువుగా ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పచుకుంటే పరిపూర్ణమైన జీవితాన్ని పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, పీజీ సత్యభాస్కర్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్‌జహాన్, విజేత వెంకట్‌రెడ్డి, శ్రీపాద గంగాధర్, అమీనా ముంతాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప బండారు ఉత్సవం

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో శుక్రవారం కుర్వ సంఘాల ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ వీరలింగేశ్వరస్వామి బండారు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుర్వ సంఘం ఆధ్వర్యంలో అరుణమ్మను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, ఎంపీటీసీ శివ, కుర్వ ఆశప్ప, బలరాంరెడ్డి, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే



మంగళిగడ్డతండాలో వేడుకలు

రాజాపూర్: ముదిరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సూపర్‌వైజర్ జ్యోతి అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలు, జయమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల పరిధిలోని లాక్యాతండా, మంగళిగడ్డ తండా, నాయకునితండా అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వార్షికోత్సవ సమావేశం నిర్వహించి, 5 సంవత్సరాలు దాటిన చిన్నారులకు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం కల్పించుటకు సరిఫికెట్స్ ఇచ్చారు. ఈమేరకు ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన తెలిపారు. ఉపాధ్యాయులు మల్లయ్య, చెన్నయ్య, అంగన్‌వాడీ టీచర్లు రంగమ్మ, చంద్రకళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రీస్కూల్ బాలబాలికల గ్రాడ్యుయేషన్ డేలో డీబ్ల్యూఓ జరీనా బేగం పాల్గొన్నారు. సీడీపీఓ మెహరున్నీసాబేగం, పాఠశాల హెచ్ఎం శారద, ఎంహెచ్‌పీ శ్వేత, సూపర్‌వైజర్ సుగుణ, అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, యాదమ్మ పాల్గొన్నారు.



ముదిరెడ్డిపల్లిలో..

బాలానగర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని చిన్నారులతో నిర్వహించారు. సూపర్‌వైజర్ అనితతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



వెన్నాచేడ్‌లో అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

గండేడ్: శ్రీరామనవమిని పురస్కరించుకొని వెన్నాచేడ్ బండమీద రామస్వామి ఆలయంలో మూడు రోజుల కొనసాగిన జాతర శుక్రవారంతో ముగిసింది. శుక్రవారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండంలో నడిచారు. శివనామస్మరణతో ప ప్రాంతమంతా మార్మోగింది. ఉదయం ఆలయంలోని మల్లన్నకు నైవేద్యం సమర్పించారు. అనంతరం సీతారామ, లక్ష్మణ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉంచారు. మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, సత్యసాయి సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, కన్వీనర్ నారాయణరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య, శరణప్ప, నాగేంద్రకుమార్, అంతర్‌గాని రాములు, పులిందర్‌రెడ్డి , పూజారులు జంగం చంద్రశేఖర్, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



హన్వాడ: మండలంలోని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్‌కు భారీగా తరలివెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రావడంతో భారీగా తరలారు. జిల్లాకేంద్రంలో ర్యాలీలో పాల్గొన్నారు.

నవాబుపేట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నామినేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో మండలం నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాంచంద్రయ్య, జహీర్, అజహర్, ఖాజా, వాసుయాదవ్, వెంకటేష్, రాజేష్, నర్సింహ, సత్యం, శ్రీహరి తదితరులు ఉన్నారు.